శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## డిసిపల్లిలో ముగిసిన పొగాకు కొనుగోళ్ళు

### - 173కోట్ల రూపాయల విలువైన పొగాకు కొనుగోళ్ళు



**మర్రిపాడు,ఆగస్ట్3ప్రభాతవార్త:** నెల్లూరుజిల్లా డిసిపల్లి పొగాకు వేలం కేంద్రంలో 2022-23 పంట కాలానికి సంబంధించిన పొగాకు కొనుగోళ్ళ ప్రక్రియ గురువారంతో ముగిశాయి. మార్చి9వ తేదీ డిసిపల్లి వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్ళు ప్రారంభమై 89రోజు లు జరిగిన వేలం లో 173కోట్ల రూపాయల విలువైన పొగాకు అమ్మకాలు జరిగాయి. వేలం ప్రక్రియలో కేజీ గరిష్టధర 270రూపాయలు, సగటు ధర 208-79రూపాయలు, కనిష్ట ధర 150రూపాయలు పలికింది. భారత పొగాకుబోర్డు ఇచ్చిన లక్ష్యం మేరకు రైతులు అదనంగా పండించిన పొగాకుతో కలిపి మొత్తం ఈవేలం కేంద్రం ద్వారా 8.30మిలియన్ కిలోల పొగాకు కొనుగోలుజరిగాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ సీజన్‌లో సరాసరి 33రూపాయలు అద నంగా ల భించింది. రాష్ట్రంలో పొగాకు సాగు ఆరంభమై డిసిపల్లి వేలం కేంద్ర పరిధిలో పొగాకు కొనుగోళ్ళు ప్రారంభ మైన దగ్గరనుంచి గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం కిలో పొగాకు 270రూపాయలు పలికి రికార్డు సృష్టించింది. ఈ ప్రాంతంలోని పొగాకు రైతులు ఎన్నో ఒడిదుడుకులు, ఎన్నో ఆర్థిక సమ స్యలతో పొగాకు సాగుచేస్తుండగా ఈసంవత్సరం వేలంలో లభించిన పొగాకు ధరలు రైతుల కష్టనష్టాలను తీర్చి వారి కుటుంబాల్లో ఆనందం నింపింది. మొత్తంగా 89రోజుల పాటు వేలం ప్రక్రియలో ఎలాంటి ఇబ్బం దులు లేకుండా విజయవంతంగా పూర్తికావడానికి సహకరించిన పొగాకు రైతులకు , రైతు సంఘ నాయకులకు , పొగాకు కొనుగోలుదారులకు, బోర్డు సిబ్బందికి వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ ధన్యవాదాలు తెలిపారు.

## టిడిపికి మంచిరోజులు వస్తాయి



**ముత్తుకూరు,ఆగస్టు3,ప్రభాతవార్త** 2024లో టిడిపి విజయకేతనం ఎగురవేస్తుందని తద్వారా మంచి రోజులు వస్తాయని టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు.గురువారం ముత్తుకూరు మండలంలోని పంటపాలెం పంచాయతీలో రచ్చబండ కార్యక్రమాన్ని ప్రారంభించారు.మండల అధ్యక్షుడు ,స్థానిక నాయకుడు పల్లంరెడ్డి రామ్మోహన్ రెడ్డి ,శ్రీధర్‌రెడ్డి సోమిరెడ్డికి,సర్వేపల్లి సమన్వ యకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమో హన్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్ల వైసీపీ పాల నతో అభివృద్ధి శూన్యమని టిడిపినాయకులపై,కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నారని ఆయన అన్నారు.ఈ నాలుగేళ్లలో వైసీపీ చేసిన దాడులను ప్రతి గ్రామంలో ఫ్లెక్సీల రూపంలో ఏర్పాటు చేసి ప్రజలకు వివరిస్తామన్నారు.మహాశక్తి తల్లికివందనం పేరుతో ఇంట్లో చదువుకునే వారందరికీ ఒక్కొక్కరికి 15వేల రూపాయలు,ఆడబిడ్డ నిధి నుండి 18ఏళు నిండిన ప్రతి స్త్రీకి నెలకి 15వేలు,దీపం పేరుతో ప్రతి ఇంటికి ఉచితంగా 3గ్యాస్ సిలెండర్లు,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,యువగళం పేరుతో 20లక్షల మంది యువతకు ఉపాది,నిరుద్యోగవృద్ధి 3వేలు,ప్రతి రైతుకు ఏటా 20వేల ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందన్నారు.పంటపాలెం పంచాయతీకి టిడిపి హయాంలో 10కోట్లు రూపాయలు అభివృద్ధి పనులు చేశామని ఆయన తెలిపారు.చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని ఆంధ్రరాష్ట్ర యావత్ ప్రజలు కోరుకుంటున్నారన్నారు.ఈ కార్యక్రమంలో బొమ్మి సురేంద్ర,సురేష్‌రెడ్డి,కోదండరామయ్య,శ్యామ్,రాగాల శివకృష్ణ,మల్లికార్జునయాదవ్,ఆలిముత్తు,దీనయ్య,దండు శ్రీనివాసులు,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో రొట్టెల పండుగను విజయవంతంగా నిర్వహించాం



**నెల్లూరుటౌన్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రొట్టెల పండుగను అత్యంత ఘనంగా ఈ ఏడాది నిర్వహించామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత సమీర్‌ఖాన్ పేర్కొన్నారు. నెల్లూరు బారాషహీద్ దర్గాలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సుమారు 15 లక్షల మంది బారాషహీద్ దర్గాను దర్శించుకుని అల్లా ఆశీస్సులను అందుకున్నారన్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటూ వారికి అన్ని వసతులను సమకూర్చామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరోసారి సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించాలని, నెల్లూరు ఎంపీ ఆదాల ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. బారాషహీద్ దర్గా ఫెస్టివల్ కమిటీ చైర్మన్ ఇస్మాయిల్ ఖాదరి మాట్లాడుతూ తమ కమిటీపై పెట్టిన నమ్మకాన్ని కాపాడుకుంటూ రొట్టెల పండుగను విజయవంతంగా నిర్వహించామన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు సహకరించారని, వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యురాలు మోబీనా, 34 డివిజన్ వైసీపీ పార్టీ ఇన్‌చార్జ్ రియాజ్, రఫిలతో పాటు పలువురు ఫెస్టివల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## చుక్కల భూముల్ని పరిష్కరించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కింది



**కావలి, ఆగస్టు 3 ప్రభాతవార్త** చుక్కల భూముల్ని పరిష్కరించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలి ఎమ్మెల్యే నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో చుక్కల భూముల్ని పరిష్కరించిన ఘనత సియం జగన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఇదిలావుంటే కావలి వెంగళరావునగర్‌లోని నిషేధిత భూముల్ని దేనికి ఉపయోగపడకుండా చేసిన ఘనత ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కిందని తెలిపారు. చదువులకు కావాలన్నా, పెళ్ళిళ్లు చేసుకోవాలన్నా మరేతర కార్యక్రమాలు చేసుకోవాలన్నా ఈ ఇళ్లు దేనికి పనికి రాకుండా పోయిందన్నారు. ఎంతోకాలంగా చుక్కల భూములను పరిష్కరించాలని ఈ ప్రాంత ప్రజలు కార్యాలయాల చుట్టు తిరుగుతున్న పనికాలేదన్నారు. ఇటువంటి పరిస్థితులలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాకరంగా చుక్కల భూముల్ని పరిష్కరించారన్నారు. జిల్లా కలెక్టర్, ఫారెస్ట్ అధికారి ఎంతో చాకచక్యంతో ఈ చుక్కల భూముల్ని పరిష్కరించారన్నారు. ఎవరి వల్ల కాని ఈ పరిస్థితి ఒక్క జగన్మోహన్‌రెడ్డి వల్లే అయిందన్నారు. ఒక్కసారి సియంకు అందరు రుణపడి వుండాలన్నారు. వెంగళరావునగర్ ప్రజలందరూ సియం జగన్మోహన్‌రెడ్డికి అండగా వుండాలన్నారు.

**జగనన్న సురక్ష ఎంతో మందికి మేలు చేసింది...** జగనన్న సురక్ష ఎంతో మందికి మేలు చేసిందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఒక్క నెల రోజుల పాటు ఈ కార్యక్రమం కావలి నియోజకవర్గంలో ఈ సురక్ష పథకాన్ని ఎంతో విజయమైందన్నారు. కావలి నియోజకవర్గంలోని వైసిపి నేతలు, అధికారులు, సచివాలయ కన్వీనర్లు అందరూ పనిచేశారన్నారు. గడపగడపకు తాను వెళ్తున్నా మధ్యమధ్యలో మళ్లీ జగనన్న సురక్షలో పాల్గొనానన్నారు. ప్రతి ఒక్కరికి సర్టిఫికేట్లు ఇవ్వడం జరిగిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. ఈ సమావేశంలో వైసిపి నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, కనపర్తి రాజశేఖర్, గంధం ప్రసన్నాంజనేయులు, కనమర్లపూడి వెంకట నారాయణ, కుందుర్తి సోదరులు, తిరివీధి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్రా క్రీడలు

**వింజమూరు,ఆగస్ట్3ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడలు పోటీలు అక్టోబరు 2నుండి ప్రారంభమవుతాయని ఎంపిడిఒ రాజేష్ బాబు తెలిపారు. మండల పరిధిలోని సచివాలయ సెక్రటరీలు , ప్రతి సచివాలయ పరిధిలోని 17సంవత్సరాల పైబడిన స్త్రీ , పురుషులు ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో పాల్గొనవచ్చని తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ , క్రికెట్, షెటిల్, బ్యాడ్మింటన్, మండల స్థాయిలో జరుగుతాయన్నారు. గెలుపొందిన వారు నియోజకవర్గం , జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి వరకు పోటీల్లో పాల్గొంటారన్నారు. కావున ఈ అవకాశాన్ని యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ రవీంద్రబాబు, ఇఒపిఆర్‌డి శ్రీనివాసులు, ఎంఇఒ మధుసూధన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఫిజికల్ ఎడ్యుకేటర్లు, పిఇటిలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

## వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరణ

**వింజమూరు,ఆగస్ట్3ప్రభాతవార్త:** వింజమూరు మండలంలో ఖాళీలేర్పడిన మూడు వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎంపిడిఒ రాజేష్‌బాబు తెలిపారు. మండలంలోని చాకలికొండ గ్రామ సచివాలయ పరిధిలో బిసి జనరల్ -1, ఒసి జనరల్, బుక్కాపురం సచివాలయ పరిధిలో బిసి మహిళ 1 ఖాళీగా ఉన్నాయన్నారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసేందుకు ప్రభుత్వ నియమనిబంధనల మేరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నా మన్నారు. 2నుండి4వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరణ, 5న దరఖాస్తుల పరిశీలన, 7న మౌఖికపరిక్షలు , ఎంపికైన వారి వివరాలు తెలియజేయడం, 9నుండి ఎంపికైన వాలంటీర్ల బాధ్యతలు నిర్వహిస్తారని, దరఖాస్తు చేసిన వారు 10వ తరగతి పాసై ఉండాలని, ఆయా ప్రాంతాలకు చెందిన వారై ఉండాలన్నారు. 18నుండి35సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలన్నారు.

# పేదలకు భూ హక్కు కల్పించేందుకే జగనన్న భూరక్ష



**వెంకటాచలం,ఆగష్టు 3ప్రభాతవార్త** రాష్టంలో ఎన్నో దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ళు నిర్మించుకొని ఎటువంటి హక్కు లేకుండా వున్న పేదలకు శాశ్వత భూ హక్కు కల్పించడమే జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. గురువారం వెంకటాచలం మండలంలోని కుంకుమపూడి గ్రామంలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష కార్యక్రమంలో మంత్రికాకాణి పాల్గొని లబ్ధిదారులకు భూ యాజమాన్య హక్కు ధృవీకరణ పత్రాలను ఆందజేశారు. ఈ సందర్భంగా మంత్రిమాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విదంగా పేదలకు మేలే జరిగేలా పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలనుముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. రూ. 2750 ఫించన్ ఇస్తున్న ఏకైక రాష్టం బారతదేశంలో మనేదనని తెలిపారు. త్వరలో దీనిని రూ. 3వేలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మీ కుటుంబానికి మంచి జరిగిందని బావిస్తే తనను ఆశీర్వదించమని అడిగిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని2019కి ముందు జరిగిన లబ్ధిని తరువాత జరిగిన లబ్ధిని ఒక సారి ప్రజలు పరిశీలించి ఓటు వేయాలని కోరారు.అంతకు ముందు ఆయన స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సంపూర్ణ పోషణ కార్యక్రమం ద్వారా గర్భిణీలకు పోషకాహారకిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి సుస్మిత,తహశిల్దార్ సుధీర్, స్థానిక ప్రజా ప్రతినిదులుపాల్గొన్నారు.

## సచివాలయాలను తనిఖీ చేసిన కమీషనర్ వికాస్ మర్మత్



**నెల్లూరు కార్పొరేషన్, ఆగష్టు 3,ప్రభాతవార్త** నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని స్థానిక 29/1, 29/2, 29/3 సుభాష్ చంద్రబోస్ నగర్, మహాత్మగాం ధీనగర్-1,2 వార్డు సచివాలయాలను కమీషనర్ వికాస్ మర్మత్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాల్లోని ఇన్‌స్పెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిష్టర్లు, స్పందన రిజిష్టర్లతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. సచివాలయాలలో పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులోగా పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని కార్యదర్శులకు కమీషనర్ సూచించారు. ఎస్‌డీజీ సర్వే, భూ హక్కు సర్వే, ఏపీ సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, సూచించిన యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని తెలిపారు. అదే విధంగా స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులు, నాడు-నేడు పనుల పురోగతి, ఆస్తి పన్ను, యూజర్ ఛార్జిల వసూళ్లను సచివాలయ కార్యదర్శులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు అందించే సేవల్లో నిబద్ధత పాటించాలని, తమకు నిర్ధేశించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను గడువులోగా అందుకోవాలని సూచించారు. జగనన్న కాలనీ లేఅవుట్ల నిర్మాణం పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని అమెనిటీస్ కార్యదర్శులను కమీషనర్ ఆదేశించారు.

# అందరి సహకారంతోనే రొట్టెల పండుగ నిర్వహణ విజయవంతంగా పూర్తి



**నెల్లూరు కార్పొరేషన్, ఆగష్టు 3,ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన బారా సాహీద్ దర్గా రొట్టెల పండుగను జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ నేతృత్వంలో అన్ని ప్రభుత్వ విభాగాలు, నెల్లూరు కార్పొరేషన్ సహకారంతో రొట్టెల పండుగ విజయవంతంగా జరిగిందని, భాగస్వాములైన ప్రతి ఒక్కరికి జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, నగరపాలక సంస్థ కమీషనర్ వికాస్ మర్మత్‌లు ధన్యవాదాలు తెలిపారు. గురువారం ఉదయం దర్గా ఆవరణలో ఏర్పాటు చేసిన నగర పాలక సంస్థ రిసెప్షన్ కేంద్రంలో రొట్టెల పండుగ ముగింపు సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రొట్టెల పండుగ నిర్వహణకు విశేషంగా కృషి చేసిన నెల్లూరు నగర పాలక సంస్థ మేనేజర్ ఇనయతుల్లా, అన్ని విభాగాల ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బందిలను జిల్లా జాయింట్ కలెక్టర్, కార్పొరేషన్ కమీషనర్‌లు ఘనంగా సన్మానించారు. రొట్టెల పండుగ నిర్వహణ విశేషాలు, సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ నిరంతరం సేవలందించిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులకు కూడా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి వారందరిని సన్మానించారు. అనంతరం జాయింట్‌కలెక్టర్, కమీషనర్‌లు మాట్లాడుతూ రొట్టెల పండుగ నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా పూర్తి చేసేందుకు అన్ని విభాగాల అధికారులతో ముందుగానే సమీక్ష సమావేశాలు నిర్వహించామని, అందరి సమన్వయంతోనే పండుగను పూర్తి స్థాయిలో విజయవంతంగా పూర్తి చేశామని వెల్లడించారు. దూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు నగరంలో వివిధ ప్రాంతాలలో మార్గనిర్దేశక సూచికలు కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులతో ఏర్పాటు చేసి, పార్కింగ్, మరుగుదొడ్లు వసతులతో పాటు దర్గా ప్రాంగణంలో అన్ని రకాల సౌకర్యాలను కల్పించడంలో నెల్లూరు నగర పాలక సంస్థ చక్కటి ప్రణాళికతో పనిచేసిందని వివరిస్తూ కొనియాడారు. దర్గా ప్రాంగణం, రొట్టెలు మార్చుకునే తీరంలో ఆధ్యాత్మిక వాతావరణానికి ఎలాంటి భంగం వాటిల్లకుండా నిరంతరం పారిశుధ్య నిర్వహణ పనులను చేపట్టడం, స్వర్ణాల చెరువు తీరంలో భద్రతా ఏర్పాట్లు, రొట్టెలు మార్చుకునే నీళ్లలో ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించడం, పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు తగ్గ విధంగా మరుగుదొడ్లను నిరంతరం శుభ్రంగా ఉంచడం, అన్ని ప్రాంతాల్లో నిరంతరం మంచినీటి సదుపాయం కల్పించడం, మంచినీటి నాణ్యతకై క్రమం తప్పకుండా పీపీఎం పరీక్షలు నిర్వహించడం, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ, భక్తులకు ఉచితంగా వైద్య సేవలు, మెడిసిన్ అందించడం, పోలీసు సిబ్బంది జన సమ్మర్ధంలో తప్పిపోయిన చిన్నారులు, కుటుంబ సభ్యులను క్షేమంగా తిరిగి సంబందీకులకు అప్పగించడం, దర్గా ప్రాంగణంలో విక్రయించే ఆహార పదార్థాలు నాణ్యతతో ఉండేలా తనిఖీలు చేయడం, షవర్ స్నానాల వద్ద పటిష్ట రక్షణ, వర్షం వచ్చినా ఇబ్బంది పడకుండా వాటర్ ప్రూఫ్ టెంట్లను ఏర్పాటు చేశామని, పారిశుధ్య నిర్వహణపై అనుక్షణం ప్రత్యేక దృష్టి పెట్టి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పర్యవేక్షించామని జాయింట్ కలెక్టర్, కమీషనర్‌లు చెప్పారు. అన్ని శాఖల అధికారుల సహకారంతో రొట్టెల పండుగను విజయవంతంగా పూర్తి చేశామని, అందరికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వారు వివరించారు. రొట్టెల పండుగ సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలో ఐదు రోజులు పాటు నిర్వహించిన రక్తదాన శిబిరంలో విశేషంగా పాల్గొని రక్తదానం చేసిన ప్రజలు, కార్పొరేషన్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సంజనా సిన్హా, నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించండి



**నెల్లూరు అర్బన్, ఆగష్టు 3, ప్రభాతవార్త** ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ నెల్లూరు మున్సిపల్ కమీషనర్ వికాస్ మర్మత్‌తో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ కూర్మనాథ్ మాట్లాడుతూ ఆగష్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పోలీసు పరేడ్ గ్రౌండ్లో ఉదయం 9గంటలకు ప్రారంభమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ముఖ్య అతిధిగా హాజరై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తారని, అనంతరం ప్రసంగం, స్వాతంత్ర్య సమరయోధులతో పరిచయ కార్యక్రమం, మాక్ డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రశంసాపత్రాలు, మెమెంటోలు పంపిణీ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. పరేడ్ ఏర్పాట్లను పోలీసు శాఖ వారు పర్యవేక్షిస్తారని తెలిపారు. పరేడ్ గ్రౌండ్‌లో పారిశుద్య ఏర్పాట్లు, తాగునీటి ఏర్పాట్లు మున్సిపల్ శాఖ చేపడుతుందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖలతో సమన్వయం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారికి సూచించారు. వ్యవసాయశాఖ, దాని అనుబంధ శాఖలు, కుటుంబ సంక్షేమ, సమగ్ర శిశు, విద్యాశాఖలు, గృహనిర్మాణ శాఖ, అగ్నిమాపక శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి, డ్వామా తదితర శాఖలు ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఇనుమడింప జేసేలా శకటాలను, ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్, సంబంధిత శాఖల అదికారులను ఆదేశించారు. అలాగే పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ, సమగ్ర శిక్ష, ఐటీడీఏ పీఓలను ఆదేశించారు. ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగుల వివరాలను జిల్లా కలెక్టర్ వారు జారీ చేసిన సూచనలకు అనుగుణంగా ఈనెల 10వ తేదీ లోగా అందజేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అధికారులందరూ వారికి అప్పగించిన విధులను సక్రమంగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సంజన సింహ, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, నుడావీసీ టి.బాపిరెడ్డి, జడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మిత, డ్వామా హౌసింగ్ పీడీలు వెంకటరావు, నాగాజు తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా సమన్వయ కమిటీ సమావేశం



**నెల్లూరు ఆగస్టు 3, ప్రభాతవార్త-వైద్యం** నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రలు ఉమ్మడి నెల్లూరు జిల్లా సమన్వయ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈనెల 5న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా ఏర్పాట్లు, విధివిధానాలు, ఓటర్‌ల జాబితా సవరణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించి చర్చించుకున్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, టీడీపీ హయాంలో నీటిపారుదల రంగాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, వైసీపీ వచ్చాక నీటిపారుదల రంగాన్ని నిర్వీర్యం చేశారన్నారు. ఈనెల 5న సాయంత్రం 4గంటలకు నెల్లూరు నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్ లో చంద్రబాబునాయుడు నీటిపారుదల రంగంపై అనుభవమున్న ప్రముఖులు, తటస్థులు, రైతులు, వివిధ రంగాల ప్రముఖులతో సమావేశం నిర్వహించనున్నారని, టీడీపీ హయాంలో నీటిపారుదల రంగానికి చేసిన అభివృద్ధిని వైసీపీ చేస్తున్న ద్రోహాన్ని మీడియా ముఖంగా ప్రజలకు వివరించనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని వెంకటరామారావు, పాశం సునీల్‌కుమార్, కంభం విజయరామిరెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, కావ లి, కోవూరు నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు మాలేపాటి సుబ్బానాయుడు, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, మాజీ మంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షుడు జడ్ శివప్రసాద్, నెల్లూరు పార్ల మెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కావలి, ఆత్మకూరు, నెల్లూరు రూరల్, ఉదయగిరి, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల పరిశీలకులు బొమ్మి సురేంద్ర, బుల్లెట్ రమణ, రాచమల్లు శ్రీనివాసులురెడ్డి, వికాస్ హరి, దావా పెంచలరావు, పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, తిరుపతి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు జన్ని రమణయ్య, మొగిలి కల్లయ్య, పమ్మిడి రవీకుమార్‌చౌదరి, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, దొడ్డపనేని రాజానాయుడు, రాష్ట్ర తెలుగురైతు ఉపాధ్యక్షుడు రాపూరి సుందరరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాపూరు రాధాకృష్ణమనాయుడు, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు బీద గిరిధర్, వంటేరు జయచంద్రరెడ్డి, టీడీపీ నాయకుడు గిరిధర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## బిడ్డకు తల్లిపాలు అమృతం వంటివి



**బుచ్చి ఆగష్టు 3 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాల హెచ్‌డబ్ల్యూలో ఎ అంతర్జాతీయ తల్లిపాల వారోత్స వాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ అతిధులుగా గ్రామ సర్పంచ్ లభంతోటి బాగ్యలక్ష్మీ పాల్గోన్నారు సూపర్‌వైజర్ శకుంతల మాట్లాడుతు ప్రతి తల్లి బిడ్డకు తప్పకుండా ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని ఆమె సూచించారు. ముర్రుపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్య కరమని చెప్పారు.కొందరు తల్లులు బిడ్డలకు పాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి అనారోగ్యాలపాలౌతున్నారని ఆమె తెలిపారు. బిడ్డకి తల్లిపాలు అమృతం వంటవి అని ఆమె పేర్కున్నారు .తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి కూడా ఎక్కువగా ఉంటుందని ఆమె వివరించారు.ప్రతి తల్లి బిడ్డకు తప్పకుండా తల్లిపాలు ఇచ్చి తల్లి,బిడ్డ ఇద్దరు ఆరోగ్యంగా ఉండే విధంగా అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు .ఈకార్యక్రమంలో సెక్రటరీ శ్యామ్ ,ఎంఎస్‌కె బి ప్రవీణా ,కృష్ణయ్య, పాల్గోన్నారు. బాలింతలకు టిహెచ్‌ఆర్ పంపీణి చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త అనీలమ్మ ,తల్లులు పాల్గోన్నారు.

## పెనుబల్లి తల్లిపాల వారోత్సవాలు



**బుచ్చి ఆగష్టు 3 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పెనుబల్లి పంచాయితీలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్స వాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో సూపర్‌వైజర్ ఉమా మాట్లాడుతు ప్రతి తల్లి బిడ్డకు తప్పకుండా ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని ఆమె సూచించారు. ముర్రుపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్య కరమని చెప్పారు.కొందరు తల్లులు బిడ్డలకు పాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి అనారోగ్యాలపాలౌతున్నారని ఆమె తెలిపారు. బిడ్డకి తల్లిపాలు అమృతం వంటవి అని ఆమె పేర్కున్నారు.తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి కూడా ఎక్కువగా ఉంటుందని ఆమె వివరించారు.ప్రతి తల్లి బిడ్డకు తప్పకుండా తల్లిపాలు ఇచ్చి తల్లి,బిడ్డ ఇద్దరు ఆరోగ్యంగా ఉండే విధంగా అవగాహన కల్పించడమే ఈకార్యక్రమం యొక్కముఖ్య ఉద్దేశమని ఆమె తెలిపారు.ఈ సందర్భంగా తల్లులకు,గర్భవతులకు టిహెచ్‌ఆర్ కిట్లు పంపీణి చేశారు.ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, శేషమ్మ,అమరసేన, ప్రబావతి తదితరులు పాల్గోన్నారు.

## గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**అల్లూరు,ఆగస్టు 3 ప్రభాతవార్త:** గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గురువారం అల్లూరు మండల పరిధిలోని ఇస్కపల్లి పంచాయతీలోని శంభునిపాళెంలో చేపట్టారు. ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. పథకాల అందుతున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అందుకోవాంటే జన్మభూమి కమిటీల ద్వారా తెలుగుదేశం కార్యకర్తలకు మాత్రమే అందాయన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన వారందరికి నవరత్న పథకాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వాలెంటరీ వ్యవస్థ ద్వారా అందజేస్తున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జగనన్న ప్రభుత్వం 95 శాతం అమలు చేసిందన్నారు. మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దర్శిగుంట శశిరేఖ, వైసిపి మండల కన్వీనర్ దండా కృష్ణారెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు నీలం సాయికుమార్, బీద రమేష్ యాదవ్, బత్తుల మోహన్‌రెడ్డి, శంభునిపాళెం వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై చర్యలు



**కావలి, ఆగష్టు 3 ప్రభాతవార్త:** మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఆపేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పూనుకోవాలని, తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు డిమాండ్ చేశారు. కావలి పట్టణ జాతీయ రహదారిపై ఓవర్ బ్రిడ్జి సెంటర్‌లో గురువారం కావలి ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ ఆధ్వర్యంలో భారీ మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీనివాసులు,యం.శ్రీహర్షలు మాట్లాడారు. 90 రోజుల నుండి మణిపూర్‌లో మైతే, కుకీ తెగల మధ్య మొదలైన హింసాకాండ వల్ల 150 మంది హత్యచేయబడ్డారన్నారు. ప్రతి రోజు మహిళలపై అత్యాచారాలు జరుగుతూనే వున్నాయన్నారు. అనేక మంది కుకీ తెగకు సంబంధించిన గిరిజనుల గృహాలను తగులబెట్టారని తెలిపారు. ఇంత విధ్వంసం జరుగుతున్నా ప్రధాని మోడీ స్పందించకపోవడం చూస్తే మణిపూర్‌లో జరుగుతున్న హింసకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అండదండలతో జరుగుతుందని విమర్శించారు. తక్షణం మణిపూర్‌లో శాంతిని నెలకోల్పాలని డిమాండ్ చేశారు. మే నెలలో వివస్త్ర చేసి రోడ్ల మీద బహిరంగంగా నడిపించిన వీడియో సోషల్ మీడియా ద్వారా ప్రపంచానికి తెలిసిన తర్వాత మాత్రమే రాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. కార్గిల్ అమరవీరుడు భార్యను వీడియో చూపినట్లుగా వివస్త్రను చేసి అత్యాచారం అనంతరం హత్య చేసిన ఘటనకు భారతదేశం తలదించుకునేలా వుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిగ్గుపడాలన్నారు. ఇలా బయటకు రాకుండా జరిగిన అనేక అఘాయిత్యాలకు మోడీ, మణిపూర్‌లో అధికారంలో వున్న బిజెపి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. గిరిజన ప్రాంతాలపై గిరిజన రిజర్వేషన్ ఇస్తామని మైతే తెగ ప్రజలకు హక్కును కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్ణయం నేడు మతకలహాలుగా మారి చర్చిలు తగలబెడుతూ క్రిస్టియన్ పాస్టర్లను చంపుతున్నారన్నారు. ఇదంతా పక్కా ప్రణాళిక ప్రకారం బిజెపి హిందుత్వ అజెండాలో భాగంగానే జరుగుతుందన్నారు.గిరిజనుల భూములను మైతే ప్రజలకు ఇవ్వాలనే సాకుతో విలువైన ఖనిజాలు కల్గిన కొండ ప్రాంతాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలన్న కుట్ర దాగి వుందన్నారు. అందుచేత కేంద్ర ప్రభుత్వం హింసాకాండను అరికట్టేందుకు ఏ ప్రయత్నం చేయలేదన్నారు. మానవత్వం లేని ప్రధానిగా మోడీ చరిత్రలు నిలిచిపోతాడని విమర్శించారు. తక్షణం అల్లర్లకు పాల్పడే అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకొని మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. దేశ సమైక్యతను కోరుకునే వారు తక్షణం మోడీ ప్రభుత్వ మతోన్మాద చర్యలను తీవ్రంగా ఖండించాలన్నారు. లేకపోతే మణిపూర్ ప్రయోగం దేశ వ్యాప్తంగా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ అమలు చేస్తుందని తీవ్ర స్థాయిలో హెచ్చరికలు చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సూర్య, ఉదయ్‌కుమార్, కావలి పట్టణ కమిటీ సభ్యులు అజయ్‌కుమార్, రాకేష్, సాయి, వాసు, మబీన్,తదితరులు పాల్గొన్నారు.

## కావలి ముసునూరులో రోడ్డు ప్రమాదంలో నలుగురుకు తీవ్ర గాయాలు



**కావలి, ఆగష్టు 3 ప్రభాతవార్త:** మంచీర్యాల జిల్లా నుంచి తిరుమలకు వెళ్తున్న ఫ్యామిలీ గురువారం కావలి సమీపంలోని ముసునూరు వద్ద రోడ్డు ప్రమాదంలో చిక్కుకొని నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ముందు పోతున్న లారీని ఈ కారు వెనుక నుంచి ఢీకొనింది. ఈ ఘటనలో మారిశెట్టి నగేష్, కనకం ప్రసాదు, ప్రశాంతి, కారు నడుపుతున్న డ్రైవర్ కూతురు శ్రేష్టలకు తీవ్ర గాయాలయ్యాయి. 108లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

## పక్కాగృహ లబ్దిదారులకు న్యాయం జరిగే వరకు జనసేన పోరాటం ఆగదు



బుచ్చి ఆగష్టు 3 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని కొట్టాలు గ్రామంలో పేదలకు మంజూరు అయిన పక్కాగృహ నిర్మాణాలు పూర్తి అయ్యే వరకు తమ పోరాటం ఆగదని జనసేన జిల్లా ప్రధానకార్యదర్శి గునుకుల కిషోర్ అన్నారు.కొట్టాల గ్రామంలో జగనన్న కాలనీ వద్ద వారు నిరాహార దీక్షకు దిగారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పేదల పక్షాన జనసేన పోరాడుతుందని అన్నారు. కాంట్రాక్టర్ ఇండ్ల నిర్మాణం చేయకుండా రకరకాల కారణాలు చెబుతున్నాడని ఆయన ఆరోపించారు. 2022 అక్టోబ ర్‌కు ముందు లక్షా 40 వేల పై చిలుకు విత్ డ్రా చేసి కాంట్రాక్టర్‌కి లబ్దిదారుల గృహనిర్మాణాలు చేయలేదని వారు ఆరోపించారు. నెల రోజుల ముందు నుండి జనసేన ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్నా హౌసింగ్ అధికారులు ఈ గృహనిర్మాణాల విషయంలో విచారణ జరిపి నిర్మాణాలు జరిగేలా ఎందుకు చూడలేదని ఆయన ప్రశ్నించారు.పేదలు అంటే అంత చులకనా అని ప్రశ్నించారు. పక్కాగృహాల విషయంలో తాము పూర్తి స్ధాయిలో అవగాహన కలిగే మాట్లాడుతున్నామని వారు స్పష్టం చేశారు.జిల్లా స్ధాయిలో అధికారులు కొట్టాలు గ్రామానికి వచ్చి అక్కడ లబ్దిదారులందర్ని పూర్తి స్ధాయిలో విచారిస్తే వాస్తవాలు తెలుస్తాయని చెప్పారు.కొట్టాలు గ్రామంలో పేదలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు. జనసేన జిల్లా నాయకులు సుదీర్‌బద్దిపూడి, కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, ఖలీల్, కేశవ్,సాయి, షారు,ఖాసిప్, తుమ్మల ప్రసాద్ జనసేననా య కులు,పాల్గొన్నారు.

## తల్లిపాల ద్వారా బిడ్డకు వ్యాధినిరోధక శక్తి



రాపూరు,ఆగష్టు3ప్రభాతవార్త పుట్టిన బిడ్డకు తల్లిపాలను ఇవ్వడం ద్వారా వారి శరీరంలో వ్యాధి నిరోదక శక్తి పెరు గుతుందని రాపూరుఐసి డిఎస్ సెక్టార్ 1 సూపర్‌వైజర్ శారదమ్మ తెలిపారు. తల్లిపాల వారోత్స వాలలో బాగంగా గురువారం రాపూరు కోత్తపేట 1, కోత్తపేట 2 అంగన్‌వాడీ కేంద్రాలలోని బాలింతలకు, గర్భవతులకు తల్లిపాల అవశ్యకతను వివరించారు. బిడ్డకు తల్లిపాలను తాపించడం ద్వారా వారికి వ్యాధినిరోదక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగా తయారైతారని చెప్పారు.బాలింతలు,గర్భవతులు అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారాబిడ్డకు సరిపోయినన్ని పాలు సమకూరుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భవతులు,బాలింతలతో పాటు, ఆరోగ్య కార్యకర్త కాంతమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్. శ్రీదేవి, పి. ఉమా, బి. రమాదేవి, ఎస్.కె ఆసిఫా, కె. స్వర్ణలత, కె.రాజమ్మ, ఎస్.కె షాభీరా, తదితరులున్నారు.

## అక్కచెల్లెమ్మలను మోసం చేసిన జగన్‌మోహన్‌రెడ్డి- పోలంరెడ్డి



**ఇందుకూరుపేట, ఆగష్టు 3, ప్రభాతవార్త** మండలంలోని ఇందుకూరుపేట పంచాయతీ పరిధిలోని గమళ్ళ పాలెంలో గురువారం జరిగిన మహాశక్తి కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాయమాటలకు రాష్ట్రంలోని నా అక్క చెల్లెళ్ళు, తల్లులు నమ్మిపోసపోయారని తెలిపారు. ప్రతి బిడ్డకు అమ్మఒడి ఇస్తా అని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి నేడు ఒక్క బిడ్డకే ఇవ్వడమే కాకుండా రెండు వేలు తగ్గించి.. రూ.13వేలు ఇస్తాన్నాడని, నేడు అవి కూడా రావడం లేదని, కొంత మందికిరూ.9వేలు, రూ.5వేలు వేసి మోసం చేస్తున్న మోసగాడు జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. అందుకే చంద్రబాబు నాయుడు మరింత సంక్షేమాన్ని మహిళలకు అందించడం కోసం మహాశక్తి కార్యక్రమం రూపొందించడం జరిగిందని తెలిపారు. ఆడ బిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం, మూడు సిలిండర్లు ఉచితం, తల్లికి వందనం, ప్రతి ఇంటికి ఉచిత మంచినీటి పథకం ఇలా అసలైన సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తారని ఆయన తెలియజేశారు. మండల అధ్యక్షులు వీరేంద్ర చౌదరి, జూగుంట స్నేహలత ఏకశిరి, వెంకటరమణమ్మ, కామేశ్వరమ్మ, సువార్త, మేహారున్నీసా, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించండి



**నెల్లూరు కార్పొరేషన్, ఆగష్టు 3, ప్రభాతవార్త** పూర్తి స్థాయిలో పరిపూర్ణమైన ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని నెల్లూరు నగర పాలక సంస్థ కమీషనర్ వికాస్ మర్మత్ కోరారు. నగరపాలక సంస్థ పరిధిలో ఓటర్ల జాబితా రూపొందించడంతో బూత్ లెవల్ అధికారులకు సహకరించాలని కమీషనర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. స్థానిక కార్పొరేషన్‌లోని కమీషనర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా సవరణలపై కమీషనర్ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ గత నెల 21నుండి బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి తిరిగి ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులకు సంబంధించిన సమాచారం సేకరిస్తున్నారని, పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు వారికి సంపూర్ణంగా సహకరించినట్లయితే ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించగలమన్నారు. రాజకీయ పార్టీలన్ని ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బూత్‌లెవల్ ఏజంట్‌ను నియమించాలని కోరారు. బీఎల్‌ఓలు ఈనెల 21వ తేదీ వరకు ఇంటింటికి తిరిగి ముందస్తు ఓటర్ల జాబితా పనులను పూర్తి చేయనున్నారని వివరించారు. అర్హులైనప్పటికి ప్రస్తుత ఓటర్ల జాబితాలో నమోదు కాని వారు, ఈ ఏడాది జనవరి ఒకటి నాటికి 18 ఏళ్ల నిండి ఓటర్లుగా నమోదు కావాల్సి న వారు నివాసం మారినవారు, ఇటీవల మరణించిన వారి సమాచారాన్ని సేకరించి, ఓటర్ల జాబితాలో తప్పులను సరిచేస్తున్నామని కమీషనర్ ప్రకటించారు. ఒకే ఇంట్లో పదిమందికి పైగా ఓటర్లు, వంద సంవత్సరాలు దాటిన ఓటర్లు ఉంటే కనుక అలాంటి వారినిక్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎక్కడైనా పోలింగ్ స్టేషన్లు మార్పు చేయాల్సి ఉన్న, ఓటర్ల జాబితా సవరణలో ఏమైనా సమస్యలు ఉన్న ఏఈ ఆర్‌ఓల దృష్టికి తీసుకురావాలన్నారు. ఒకే ఇంటికి సంబంధించిన కుటుంబ సభ్యుల ఓట్లు వేరు వేరు పోలింగ్ బూత్‌లో లేకుండా, ఒకే పోలింగ్ బూత్‌లో ఉండే విధంగా జాబితాలో మార్పు చేర్పులు చేస్తున్నామని కమీషనర్ తెలిపారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కాంగ్రెస్-మల్లిఖార్జున, టీడీపీ -భువనేశ్వర్ ప్రసాద్, బీఎస్‌పీ -శ్రీరామ్, సీపీ -షాన్ వాజ్, ఫిరాజ్, తహశీల్దార్ నిర్మాలనందబాబా, డీసీపీ దేవీకుమారి, ఈడీటీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

## యన్‌టిఆర్ ఉచిత వైద్య శిబిరం ద్వారా215మందికి వైద్యశేవలు




కలిగిరి, జూలై03, ప్రభాతవార్త; కలిగిరి మండలంలోని వెలగపాడు పాఠశాల వద్ద గురువారం కాకర్ల ట్రస్ట్ ఏర్పాటు చేసిన యన్‌టిఆర్ ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. కాకర్ల ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ ఆధ్వర్యంలోఏర్పాటు చేసిన యన్‌టిఆర్ ఆరోగ్య సంజీవిని ఉచిత వైద్యశిబిరం వెలగపాడులో ఏర్పాటు చేయగా చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు ఈ వైద్యశిబిరంలో పాల్గొన్నారు. వచ్చిన వారికి ట్రస్టు వైద్య అదికారులు శిబ్బంది అన్నిరకాల వైద్యపరీక్షలు నిర్వహించిమందులను అందజేశారు. షుగర్ బిపి, మొదల గుర్వ్యాదులకు సంభందించిన పరీక్షలునిర్వహించారు. వివిద వ్యాదులకు సంభందించి130మందికి పరీక్షలునిర్వహించగా కంటికిసంభందించి మరో85మందికి పరీఓలు నిర్వహించారు. మొత్తం 215మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం జరిగిందనినిర్వాహకులు తెలిపారు. ఈకా ర్యక్రమం లోగన్నమనేని శ్రీనివాసులు నాయుడు, దుబ్బగుంట బుజ్జియ్య,గొల్లపూడి ప్రసాద్,మండలపూడి దుర్గాబాబు, గుర్రం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## 21లక్షలు పలికిన పశువులసంత వేలం



మనుబోలు,ఆగస్ట్3,ప్రభాతవార్త:మనుబోలు పశువులసంత ఈఏడాది 21లక్షలధర పలికింది.ప్రస్తుతం సంత నిర్వహిస్తున్న భాస్కర్‌రెడ్డి 21లక్షలకు పశువుల సంతను దక్కించుకోవడం విశేషం.స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం సాయంత్రం సర్పంచ్ కంచి పద్మమ్మ,ఉపసర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి ఇ.ఒ.పి.ఆర్.డి ప్రసాద్,యు.ఒ ఆత్మకూరు వెంకటరమణ వేలంపాట పెట్టారు.8మంది డిపాజిట్లుకట్టి వేలంపాటకు హాజరయ్యారు.దువ్వూరు సుధాకర్‌రెడ్డి,వేలూరు భాస్కర్‌రెడ్డిలమధ్య పోటాపోటీగ వేలంపాట జరిగింది.చివరకు భాస్కర్‌రెడ్డి 21లక్షలకు పశువుల సంతను పాడుకున్నట్టు అధికారులు ఖరారుచేశారు.గతేడాదికంటే13లక్షలు అదనంగ పంచాయతికి ఆదాయం వచ్చింది.వేలంపాట దక్కించుకున్న వేలూరు భాస్కర్‌రెడ్డికి ఉపసర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి పంచాయతి సిబ్బంది పూలమాలలువేసి సత్కరించా రు. 13లక్షలు పంచాయతికి ఆదాయం రావడంపట్ల ఇ.ఒ.పి.ఆర్.డి ఆత్మకూరు వెంకటరమణయ్య హర్షంవ్యక్తం చేశారు.సి.ఐ సంగమేశ్వరరావు,ఎస్.ఐ అజయ్‌కుమార్ సమక్షంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## జట్లకొండూరులో జగనన్న భూహక్కు గ్రామసభ



**మనుబోలు,ఆగస్ట్3,ప్రభాతవార్త:**మండలంలోని జట్లకొండూరు గ్రామంలో జగనన్న శాస్వతభూహక్కు భూరక్ష పదకం ప్రారంభ గ్రామసభ గురువారం నిర్వహించారు.ఆగ్రామ ఉపసర్పంచ్ ఆవుల తులసీరామ్ అధ్యక్షతన సభనిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగ తహసిల్‌దార్ బి శివకృష్ణయ్య,మండల సర్వేయర్ శ్రీనివాసులు విచ్చేశారు.గ్రామంలో రైతులు వారి పొలాలకు సంబందించిన పత్రాలు తీసుకొని భూమిమీదకువచ్చి వివరాలు తెలియజేయాలని తహసిల్ దార్ శివకృష్ణయ్య తెలిపారు.ఈకార్యక్రమంలో వి.ఆర్.ఒ అఖిల్,విలేజ్ సర్వేయర్ రాజ,సచివాలయం కన్వీనర్‌లు ఆవుల జగదీష్ యాదవ్,గుంజి రమేష్,బందిపూడి సురేష్,పల్లంరెడ్డి రాజారెడ్డి,ఉమ్మడి వెంకటశేషయ్య,పూర్ణ య్య,ప్రసాద్‌నా యుడు,మాద వ్,శివ,రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు,

## ఎంపిడీవో కార్యాలయంలో తల్లి పాల వారోత్సవాలు



**కొడవలూరు ఆగష్టు3 ప్రభాతవార్త:** రాష్ట్ర వాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తల్లి పాల వారోత్స వాలను కొడవలూరు మండలం, ఎంపిడీవో కార్యాలయం నందు గురువారం అంగన్‌వాడి కార్యకర్తలతో ఐసిడీఎస్ సూపర్‌వైజర్ వి. పద్మావతి తల్లిపాల వారోత్స వాల కార్యక్రమాని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఆయన తల్లిలకు, గర్భిణ స్త్రీలకు ఈ కార్యక్రమం ద్వారా అవగాహన తెలిపి, పోషక ఆహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీవో సుబ్రహ్మణ్యం, కోవూరు అడిషనల్ సిడిపివో అరుణ, ఎంపిపి గాలి జ్యోతి, మండల కన్వీనర్ గంధం వెంకట శేషయ్య, సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడి కార్యకర్తలు, గర్భిణీ స్త్రీలు, తల్లిలు తదితరులు పాల్గోన్నారు.

## అబాగ్యునికి కాకర్ల ఆర్దిక సాయం



**కలిగిరి, ఆగష్టు03, ప్రభాతవార్త;** ఆపదున్న వారిని ఆదుకోవడంలో తనకు సాటి మరెవ్వరూ రారని చాటుకుంటున్న వ్యక్తి కాకర్ల సురేష్. అమెరికాలో స్థిరపడిన సురేష్ ఈప్రాంత ప్రజలకు ఏదైనా ఉన్నంతలో మేలు చేయాలనే సిద్ధాంతంతో ఉదయగిరి నియోజకవర్గంలో కాకర్ల చారిటీబుల్‌ట్రస్ట్‌నుఏర్పాటు చేసి దానిద్వారా ప్రజలకు తనవంతు సహాయ సహకారాలు అందజేస్తూ ఆపదలో మీకు తోడు నేనుంటా!నంటూ ముందుకు వస్తున్నారు.నియోజకవర్గంలోని ఏమారుమూల గ్రామమైనా ఇబ్బందుల్లో ఉన్నారని తన దృష్టికి వచ్చిందే తడవుడా వారికి శేవజేస్తూ మనసున్న మారాజుగా పేరు సంపాదించుకున్నారు.ఈ క్రమంలోకలిగిరి మండలం శిద్దనకొండూరు గ్రామానికి చెందిన యస్సీ వ్యక్తి తాళ్లూరి మాదవ ఇటీవల మరణంచి ఆకుటుంభం ఇబ్బందులో ఉండడం సురేష్ చేరవేశారు ఆగ్రామస్తులు, గంగినేని రంగారావు,గొట్టిపాటి రాజేష్ తదతరులు.దీనితో విషయం తెలిసిన వెంటనే తమ ట్రస్ట్ ద్వారా రు. 10వేలు రూపాయలు ఆర్దిక సాయం ఆకుటుంబానికి అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలోగేనేడి పెంచిల నాయుడు, ట్రషష్ట సబ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు యాజమాన్య పద్ధతులతో అధిక లాభాలు



**వింజమూరు,ఆగస్ట్3ప్రభాతవార్త:** ప్రస్తుతం వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులను రైతులు అనుసరించడం ద్వారా పంటల్లో అధిక దిగుబడులను సాధించవచ్చని 'ఆత్మ' డిప్యూటీ డైరెక్టర్ శివన్నారాయణ పేర్కొన్నారు. గురువారం వింజమూరులోని 1వ రైతు భరోసాకేంద్రంలో జరిగిన మండల స్థాయి రైతు శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రైతులు సాగుచేస్తున్న పంటల్లో నాణ్యమైన దిగుబడులను సాధించే లక్ష్యంగా రైతులకు సమగ్రమైన రీతిలో ప్రయోగాత్మకంగా వివరించారు. భూసార పరిక్షలు, విత్తన శుద్ధి , పచ్చిరొట్ట పైరు, నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవడం వలన ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయన్నారు. అంతర్‌పంటల్లో భాగంగా కంది, మొక్కజొన్న , దోస, మినుము, నువ్వులు, కొర్రలు వేస్తే పెట్టుబడులను త్వరగా పొందవచ్చున్నారు. అన్నదాతల సౌలభ్యం కొరకు ప్రభుత్వ ఆశయాలు, లక్ష్యాలను క్షేత్రస్థాయిలో రైతులకు చేరువచేయాల్సి న బాధ్యత వ్యవసాయశాఖపై ఉందన్నారు. ఈకార ్యక్రమంలో నెల్లూరు ఖుషి విజ్ఞానకేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ విజయకుమార్ నాయక్, ఎడిఎ రామిరెడ్డి , ఎఒ కె.శివనాగప్రసాద్, ఎఇఒ మనోహర్, రైతు సంఘ నాయకుడు రాజగోపాల్‌రెడ్డి, విహెచ్‌ఎలు, విఎఎలు , రైతులు పాల్గొన్నారు .

## బొల్లినేని రాక నేడే

**వింజమూరు,ఆగస్ట్3ప్రభాతవార్త:** వింజమూరు పంచాయతీ పరిధిలో వినాయకనగర్, వెంగమాంబ నగర్, టీచర్స్ కాలనీల్లో టిడిపి ఆధ్వర్యంలో జరిగే మహాశక్తి కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు శుక్రవారం హాజరవుతారని మండల కన్వీనర్ గొంగటి రఘునాధరెడ్డి తెలిపారు. ముందుగా వింజమూరు పాతబస్టాండ్ సెంటర్‌లోని టిడిపి జెండా దిమ్మె వద్ద పతాకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే మహాశక్తి పథకం ద్వారా చేకూరే లబ్ధి గురించి మహిళా నేతలు ఇంటింటికి తిరిగి వివరిస్తారన్నారు. టిడిపి మహిళలకు ఆస్థిలో సమాన వాటా కల్పించిందని, డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళలను ఆర్థికంగా ఆదుకుందన్నారు. వైసిపిలో జరిగే అక్రమాలను, అన్యాయాలను వివరిస్తారన్నారు. ఈకార్యక్రమానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

## ఆడుదాం ఆంధ్ర క్రీడలు విజయవంతం చేయండి



**బిట్రగుంట, ఆగస్టు 3 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడలకు సంబంధించి బోగోలు ఎంపిడివో కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. క్రీడలు ఎలా నిర్వహించాలి అనే అంశంపై మండల విద్యాశాఖాధికారులు,వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశంలో ఎంపిడివో అమ్మిశెట్టి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్,బ్యాడ్మింటన్ క్రీడలకు ప్రతి గ్రామం నుంచి 17 సంవత్సరాలు దాటిన వారు పాల్గొనేలా చూడాలన్నారు. ఇందుకు గ్రామ స్థాయిలో సర్పంచ్, వార్డు సభ్యులు, మండల స్థాయిలో ఎంపిపి, ఎంపిటిసి, జెడ్పీటీసీతో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు వీటిని నిర్వహించాలన్నారు. గ్రామ స్థాయిలో విజేతలు మండల స్థాయికి, మండల స్థాయిలో విజేతలు డివిజన్ స్థాయికి, డివిజన్ స్థాయిలో విజేతలు జిల్లా స్థాయికి, జిల్లా స్థాయి విజేతలు రాష్ట్ర స్థాయికి ఎంపిక కాబడతారన్నారు. ఈ సమావేశంలో ఎంఇవోలు జయలక్ష్మి,నరసింగరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 3,4,5 వార్డులలో జగనన్న సంపూర్ణ పౌష్టికాహారం పంపిణీ



**కావలి రూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త:** గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది.అందులో భాగంగా గురువారం కావలి పట్టణంలోని 3,4,5 వార్డులలో గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 3వ వార్డు వైసిపి ఇన్‌చార్జ్ మండలి కృష్ణారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో బాలింతలు, గర్భవతులు ఈ పౌష్టికాహారాన్ని తీసుకుని పౌష్టికంగా వుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు షేక్ నాయబ్ రసూల్, మహిళా పోలీసులు పావని, శైలజ, హైమావతి, రత్నకుమారి, అంగన్‌వాడీ బాధ్యులు అరుణ, శ్యామల, మంజుల, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## వాలంటీర్ మౌనికను సత్కరించిన అమరా



**కావలి, ఆగస్టు 3 ప్రభాతవార్త:** కావలి మున్సిపాల్టీ పరిధిలోని సచివాలయ వాలంటీర్ రసపుత్ర మౌనికను వైసిపి నేత, ఈ వార్డు ఇన్‌చార్జ్ అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా ఘనంగా సత్కరించారు. సచివాలయ కన్వీనర్, గృహ సారథులతో ఆయన ఆమె నివాసానికి వెళ్లి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అమరా మాట్లాడారు. ఈ వాలంటీర్ క్లస్టర్‌లోని చిత్తాతూరి వీధికి చెందిన మోహనమ్మకు ఆరోగ్యం బాగలేక నెల్లూరులో వుంటుందన్నారు. నాలుగు మాసాలుగా నెల్లూరుకు వెళ్లి పింఛన్‌ను వాలంటీర్ రసపుత్ర మౌనిక అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పెసల వెంకటేశ్వర్లు, గృహ సారథులు దారా సునీత, చిల్లర నరసింహరావు, గురజాల రవి, రామ్మోహన్‌సింగ్, వేగూరు రేఖలు పాల్గొన్నారు.

## మణిపూర్ ఘటనను నిరసిస్తూ పాస్టర్లు ర్యాలీ




**కందుకూరు,ఆగస్టు3,ప్రభాతవార్త:** మణిపూర్ ఘటనను నిరసిస్తూ కందుకూరు నియోజకవర్గంతోపాటు సింగరాయకొండ,పొన్నలూరుకు సంబంధించిన పాస్టర్లు క్రైస్తవ సంఘాల సహోదర, సహోదరీమణులు ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఫాదర్ బంగ్లా నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు మణిపూర్ హత్య ఘటనను నిరసించండి అనే నినాదాలతో వందలాదిమంది నిరసనర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఏబీఎఫ్ఎంఎస్ ట్రెజరర్ పి.సుజయ్ మాట్లాడుతూ మణిపూర్ మారణకాండ సభ్య సమాజానికి తలవంపు అన్నారు.అభం శుభం తెలియని స్త్రీ మూర్తులను నగ్నంగా ఊరేగించి,వారిపై భౌతిక దాడులకు పాల్పడి,మానభంగాలు చేయడం అనేది అత్యంత హేయమైనసంఘటన అని దీనిని యావత్ ప్రపంచం గర్హిస్తున్నదని ఆయన ఆవేదన వ్యక్తం వెల్లబుచ్చారు.భారతదేశం వంటి సనాతన సాంప్రదాయం కలిగనటువంటి దేశాల్లో ఇలాంటి దుశ్చర్యలు చోటు చేసుకోవడం ఏమిటని దీన్ని ఎలా వర్ణించాలో ఆర్థంకాని పరిస్థితిలో ఈ దేశం,ప్రపంచం ఉందని ఆయన తీవ్ర భావోద్వేగానికి గురైయ్యారు.ఈ కార్యక్రమంలో సంఘ కాపరులు ప్రతాప్,ప్రభాకర్,రమేష్,అనిల్,జయపాల్,చనమాల శ్రీధర్,సిహెచ్ నాగభూషణం,వివిధ చర్చిల పాస్టర్లు,ప్రధాన కార్యదర్శులు,క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇనమడుగులో కేంద్ర బృందం కమిటీ సభ్యులు



**కోవూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు గ్రామ పంచాయతీని స్వచ్ఛ సర్వేక్షణ్ 2023కి ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో గురువారం కేంద్ర బృందం కమిటీ సభ్యులు వేణుగోపాల్, డీఆర్‌పీఎస్ కె. ఆదిలక్ష్మి, పరదేశి, ప్రసాద్‌రెడ్డిలు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను వారు నిశితంగా పరిశీలించారు. గ్రామాలు స్వచ్ఛ గ్రామాలుగా మారేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయని, ఇందుకు రపజలు కూడా పూర్తిస్థాయిలో సహకారం అందించి సకాలంలో పన్నులు చెల్లించడం, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకునే కార్యక్రమాలను చేపట్టి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం సభ్యులు గ్రామంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని కూడా నిశితంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంత ర౦ ఎంపీడీవో శ్రీహరి మాట్లాడుతూ ప్రజలు కూడా పంచాయతీ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని చెత్తా చెదా రాలను ఎక్కడంటే అక్కడ పడవేయకుండా మీ ఇంటికి వచ్చే గ్రీన్ అంబాజిడర్లకు తడి చెత్త, పొడి చెత్త రూ పంలో వాటిని అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రమీలమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కళ్యాణి, ఈవోపీఆర్డీ ఆదినారాయణరావు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

## విలేఖరు భాగ్యరాజ్ కుటుంబానికి 50 వేల ఆర్థిక సహాయం

**బుచ్చి ఆగస్టు 3 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెంలో విలేఖరుగా పనిచేస్తు గుండెపోటుతో మృతిచెం దినభాగ్యరాజ్‌కుటుంబానికికోవూరుశాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎన్ఎస్ఆర్ ట్రస్టు ద్వారా 50 వేల రూపాయాలు ఆర్థిక సహాయం అందించారు.ఈకార్యక్రమంలో వైసిపినాయకులు మోర్ల మురళీ, కౌన్సిలర్ చీర్లప్రసాద ఉన్నారు. ఎమ్మెల్యే మంచి మనస్సుకు పాత్రికేయులు ప్రతే ్యకంగా ధన్యవాదాలు తెలిపారు.భాగ్యరాజ్ కుటుంబానికి ఎమ్మెల్యే చేసిన సహాయం మరవలేనిదని పలువురు హర్షం వ్యక్తం చేశారు.



## గర్భవతులు, బాలింతలు పౌష్టికాహారం తప్పక తీసుకోవాలి



**లేగుంటపాడ(కోవూరు), ఆగస్టు 3 ప్రభాతవార్త :** కోవూరు మండలం లేగుంటపాడు గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీడీపీవో జ్యోతి మాట్లాడుతూ బాలింతలు, గర్భవతులులలో పౌష్టికాహారం పాళ్లు ఎక్కువగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పౌష్టికాహార కిట్లను వారికి పంపిణీ చేస్తుందన్నారు. వాటిని క్రమం తప్పకుండా తీసుకుని ఆరోగ్యవంతులు కావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. నెలకు ఒక పర్యాయం గర్భవతులకు, బాలింతలకు ఈ కిట్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిస్థాయిలో బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఇటువంటి వినూత్న పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. గర్భవతులు, బాలింతలు వీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రమీల కేంద్రాల్లో అందించే పోషకాహార విలువలపై వారిలో అవగాహన కల్పించారు. అనంతరం కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, ఏఎన్ఎం కళావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

## మందుల వాడకంలో నిర్లక్ష్యం తగదు



**పడుగుపాడు( కోవూరు) ఆగస్టు 3 ప్రభాతవార్త :** గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు మందుల వాడకం విషయంలో నిర్లక్ష్యం చూపకుండా క్రమం తప్పకుండా వాడుకోవాలని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రవిబాబు తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు గ్రామ పంచాయతీ సచివాలయం-3 పరిధిలో గురువారం ఫ్యామిలీ ఫిజీసియన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

## జలజీవన్ మిషన్ పనులు మరింత వేగవంతం కావాలి



**కోవూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సురోఇతమైన నీరు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అందిస్తున్న జలజీవన్ మిషన్ పనులు మరింత వేగవంతం కావాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్ అన్నారు. కోవూరులోని ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కార్యాలయంలో సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన ఏఈలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబ్ధనలకు లోబడి సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు జగదీష్, వినయ్, హరికృష్ణ, హజరత్తయ్య, రమేష్, తదితరులు ఉన్నారు.

## విధుల పట్ల బీఎల్‌వోలకు నిర్లక్ష్యం తగదు



**కోవూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త :** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రస్తుతం నిర్వహిస్తున్న ఓటరు నమోదు కార్యక్రమం పట్ల సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు బాధ్యతాయుతంగా విధులు చేపట్టాలే తప్ప నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం. పద్మజ హెచ్చరించారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం కోవూరు మండలంలోని అన్ని గ్రామాల బూత్ లెవల్ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బీఎల్‌వో వారికి కేటాయించిన పోలింగ్ బూత్ ప్రాంతాల్లో ఒకే కుటుంబంలోని ఓటర్లను ఒకే పోలింగ్ స్టేషన్‌లో చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మృతిచెందిన వారి వివరాలు, డబుల్ ఎంట్రీలు లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా పోలింగ్ స్టేషన్‌లో7 వంద సంవత్సరాలు పైబడి ఓటరు పేరు నమోదు అయి ఉంటే ఆ ఓటరు యొక్క వయస్సును పరిశీలించాల్సి ఉంటుందన్నారు. 2023 అక్టోబర్ 1వ తేది నాటికి 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. అనంతరం బీఎల్‌వోల వారీగా పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ సుధా, బీఎల్‌వోలు ఉన్నారు.

## ఈ నెల 10వ తేది ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలి



**కోవూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లోని పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను పక్కదారి పట్టించిన రాష్ట్ర ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పార్టీలకతీతంగా కోవూరు మండలంలో ఉన్న సర్పంచ్‌లు, వార్డు సభ్యులను కలుపుకుని ఈ నెల 10వ తేది కలెక్టరేట్ కార్యాలయంలో జరిగే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు రఘురామయ్య కోవూరులోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పనికి ఆహార పథకానికి కేంద్రం ఇచ్చిన నిధులను దుర్వినియోగం చేయడమే కాకుండా ఆర్అండ్‌బీ, పీడబ్ల్యూడీ సంస్థలలో పనిచేస్తున్న కార్మికులకు చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఇటువంటి చర్యలను భారతీయ జనతాపార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నగేష్, పెంచల్‌రెడ్డి, నాగరాజు, జనార్ధన్, శివకుమార్, మల్లికార్జున, తదితరులు ఉన్నారు.

## గృహనిర్మాణాలపై అవగాహన



**బిట్రగుంట,ఆగస్ట్3, ప్రభాతవార్త:** బోగోలు మండలం ఏనుగులబావి పంచాయతీలో గురువారం జగనన్న పక్కాగృహాల నిర్మాణాలపై అబ్దిదారులతో అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు.ఎం.పి.డి.ఒ వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో గృహనార్మాణ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రంగవరప్రసాద్ అబ్దిదారులతో ముఖాముఖిగ మాట్లాడి నిర్మాణాలవల్ల కలిగే లాభాలు ప్రభుత్వం ఇస్తున్నా రాయితీలపై అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో గృహనిర్మాణశాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు వరం లాంటిది పంటపాలెం సర్పంచ్ ఆలపాక సీనయ్య



**ముత్తుకూరు,ఆగస్టు3,ప్రభాతవార్త:** తల్లిపాలు బిడ్డకు వరం లాంటిదని పంటపాలెం సర్పంచ్ ఆలపాక సీనయ్య అన్నారు.గురువారం మండలంలోని పంటపాలెం పంచాయతీలోని కోళ్లమిట్ట అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధులుగా హాజరై మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రిపాలు తాగించాలన్నారు.ఈ పాలలో వ్యాధినిరోదక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు.పిల్లలు విద్యార్థి దశకు వెళ్లాలంటే అంగన్వాడీ నుంచి పిల్లలు వెళ్లాలని ఆయన తెలిపారు.ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేశారని,పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.తల్లులు,గర్భవతులు ఈ వారోత్సవాలలో పాల్గొని అధికారులు చేప్పే సూచనలు,సలహాలు తీసుకోవాలని ఆయన కోరారు.అనంతరం పోషక ఆహారం కలిగిన కిట్ అందజేశారు.అనంతరం ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తిన్నెలపూడి బ్రహ్మానందం,సూపర్వైజర్ సుబ్బమ్మ,ఎమ్ఎల్‌హెచ్‌పి లావణ్య, ఏఎన్ఎం శైలజ,అంగన్వాడీ కార్యకర్తలు మంజుల,పద్మ,ఆశా వర్కర్లు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR, HYDERABAD (SOUTH), AT: ERRAGADDA
ABR.CF.NO : 473 OF 2022
BETWEEN:-
M/S. MARGADARSI CHIT FUND PRIVATE LIMITED, AMEERPET BRANCH, Represented by its Foreman/ Branch Manager. ...DISPUTANT
And
MR. S. MURALI & OTHERS. ...OPPONENTS
1. Mr. Srivathsam Murali S/o Srivathsam Sundaram Naidu, DOB: 07.09.1968, W/as: Senior Electrician, Emp.Code: 4266, M/s. Prime Meiden Limited, APIIC-MPSEZ, Menakur (V), Naidupet (M), SPSR Nellore District, A.P-524126, R/o H.No.13-266-134, Thirumala Nagar, Settipalli, Tirupathi, A.P-517507. Mob No.9441892879.
2. Mr. Murugesan Lakshmanan S/o Lakshmanan Punniya Kotti, DOB: 04.06.1986, W/as: Manager, Emp.Code: 4609, M/s. Prime Meiden Limited, APIIC-MPSEZ, Menakur (V), Naidupet (M), SPSR Nellore District, A.P-524126, R/o H.No.2-13-28, Treasury Street, Beside Manjeera Water Plant, Pichi Reddy Thopu, Naidupet, SPSR Nellore Dist. A.P-524126. Mob No.9666669772.
3. Mr. Mamidi Deva Kumar S/o Mamidi Madhan Mohan Rao, DOB: 25.06.1984, W/as: Assistant Manager, Emp.Code: 4025, M/s. Prime Meiden Limited, APIIC-MPSEZ, Menakur (V), Naidupet (M), SPSR Nellore District, A.P-524126, R/o H.No.12-44, Pichi Reddy Thopu, Naidupet, SPSR Nellore Dist. A.P-524126. Mob No.9666646940.
4. Mr. Nandi Sravan Kumar S/o Nandi Srinivasa Rao, DOB: 25.08.1987, W/as: Senior Engineer, Emp.Code: 4183, M/s. Prime Meiden Limited, APIIC-MPSEZ, Menakur (V), Naidupet (M), SPSR Nellore District, A.P-524126, R/o H.No. 2-200/1, Flat No.2, Vema Junior College Street, Naidupet, SPSR Nellore Dist. A.P-524126. Mob No.9010578637.
5. Mrs. Srivathsam Murali Padmavathi W/o Srivathsam Murali, DOB: 01.01.1981, Occ: Property Holder, R/o H.No.13-266-134, Thirumala Nagar, Mangalam, Settipalli, Tirupathi, A.P-517507. Mob No.9398640089.
Please take notice that the above Dispute is filed against you of Rs.3,64,592=00 (Rupees Three Lakhs Sixty Four Thousand Five Hundred and Ninety Two only) and the same is Posted to 26-08-2023 for your appearance before the office of Deputy Registrar of Chit/Arbitrator, Hyderabad (South) at Erragadda, at 03.00 P.M. If you fail to attend this office of Deputy Registrar of Chits / Arbitrator on that day the matter will be heard and decided exparte.
//BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR//
Sd/- R. CHAKRADAR
ADVOCATE
H.NO.6-1-295/1 PADMARAO NAGAR, SECUNDERABAD.

## మాదక ద్రవ్యాలతో చెడు మార్గంలో యువత సెబ్ సిఐ బాలకృష్ణ




**ముత్తుకూరు,ఆగస్టు3,ప్రభాతవార్త:** విద్యార్థుల అవగాహన కార్యక్రమంలో సెబ్‌సిఐ బాలకృష్ణ ,కళాశాల హెచ్‌ఓడి బాలసుబ్రహ్మణ్యం పాలొ ్గన్నారు.జిల్లాలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాదకద్రవ్యాలు వినియోగం అనే అంశంపైన విద్యార్థులకు అవగాహన కలిగేలా తెలుసుకుని జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు.ప్రధానంగా యువత చెడు మార్గంలో తమ ప్రాణాలకముప్పు తెచ్చుకుంటున్నట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సిఐ బాలకృష్ణ పేర్కొన్నారు.గురువారం ముత్తుకూ రులో గల ఫిషరీస్ కళాశాలలో మాదకద్రవ్యాల ప్రమాదంపై,గుడ్ టచ్ బ్యాడ్‌టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించి ఇటువంటి తప్పులు తాము చేయమని చేసిన వారిని క్షమించమని ప్రతిజ్ఞ చేయించారు.మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలు వివరించారు.మాదకద్రవ్యాలు కలిగి ఉన్న,రవాణా,అమ్మిన,కొనిన అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని,మాదకద్రవ్యాల సమాచారం గురంచి గవర్నమెంట్ టోల్‌ఫ్రీ నెంబర్ 14500కు సమాచారం ఇవ్వగలరని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో భవిష్యత్తులో ఉన్నత స్థితికి ఎదగాల్సిన యువత చెడు స్నేహాల కారణంగా మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయమై విద్యార్థులకు అవగాహన ద్వారా యువతలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు.మాదకద్రవ్యాల బారిన పడి నష్టపోయిన ఉందతాలను గణాంకాలతో వివరించారు.విద్యార్థులు ఉన్నతంగా చదివి సంస్కారవంతులుగా ఎదిగి ఉన్నత స్థితికి వచ్చి తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల కీర్తిప్రతిష్టలు కాపాడాలని కోరారు. కళాశాల ఉపాధ్యాయులుతో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భట్రాజులను గుర్తించిన పార్టీ టీడీపీ



**నెల్లూరు ఆగస్టు 3, ప్రభాతవార్త-వైద్యం:** మొట్టమొదటసారిగా భట్రాజులను, ఆ కులానికి గుర్తింపునిచ్చిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని టీడీపీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ప్రసన్నాంజనేయులు పేర్కొన్నారు. గురువారం తెలుగుదేశం పార్టీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు, నెల్లూరు నారాయణ సారధ్యంలో టీడీపీ సాధికార సమితి నెల్లూరు జిల్లా కన్వీనర్ మురళీమోహన్‌రాజు ఆధ్వర్యంలో భక్తవత్సలనగర్‌లో ఇంటింటికి బీసీల భరోసా బాట సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భట్రాజుల కుల అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో రూ.15కోట్లు నిధులను టీడీపీ కేటాయించిందన్నారు. భట్రాజు కుటుంబీకుడు రాజకీయం, ఆర్థికం, సామాజికంగా ముందుకు సాగేలనే ఆలోచనతో సాధికార సమితిని ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తానే భట్రాజుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో భట్రాజు సాధికార సమితి సభ్యుడు తిరుపతిరాజు, ఓంకారం వెంకటేశ్వరరాజు, కప్పా శ్రీనివాసరాజు, అవధానం ప్రభాకర్‌రాజు, నన్నయభట్టు, శ్రావణ్‌రాజు, ఎన్ వినోద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## ముర్రుపాలలో బలవర్ధకమైన పోషకాలు ఉన్నాయి

**కోవూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త :** పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు అందించడం వలన అందులో ఉన్న బలవర్ధకమైన పోషకాల వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక అన్నారు. కోవూరులోని కొతూనతరులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోతనసవాల సందర్భంగా గర్భవతులకు , బాలింతలకు తల్లిపాల విశిష్టపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పలు పౌష్టికాహారాలు, తక్కువ ఖర్చుతో లభించే పౌష్టికాహారాలపై గర్భవతులు, బాలింతల్లో అవగాహన పెంచేలా అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భవతులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారంతో పాటు పాలు, ఆకుకూరలు కూడా ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.



## ఎంపీ ఆదాల ఆశీస్సులతో గిరిజన పల్లె బాట- పాలకీర్తి రవి



**నెల్లూరుటౌన్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సారథ్యంలో వైసీపీ జిల్లా గిరిజన శాఖ అధ్యక్షుడు పాలకీర్తి రవి 25 రోజుల పాటు గిరిజన పల్లెబాట కార్యక్రమాన్ని నిర్విరామంగా చేపట్టనున్నారు. ఈ నెల 7వ తేది ప్రారంభం కానున్న ఈ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాలకీర్తి రవి మాట్లాడుతూ నెల్లూరు రూరల్ పరిధిలోని 26 డివిజన్లు, 18 పంచాయతీల్లో ఈ పల్లెబాట కార్యక్రమం సాగుతుందని తెలిపారు. అక్కడ స్థానిక సమస్యలతో పాటు గిరిజనులకు ఓటరు, ఆధార్, రేషన్ కార్డులను కల్పించడంతో పాటు చదువు మానేసిన పిల్లలను మళ్లీ బడికి పంపడం ఇందులో లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. ఈ నెల 7వ తేది 11 గంటలకు కొండ్లపూడి గ్రామంలో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం వచ్చే నెల 3 వరకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తన ఆశీసఉ్సలను అందజేశారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్టీ సెల్ నాయకులు స్వర్ణ ప్రసాద్, జగన్నాథం, శ్రీను, గున్నము రాహుల్, చల్లా మాధవి, అరవ కామాక్షి, అల్లాడి అశోక్‌దాస్, దాసరి రాజేష్, ఎంపీటీసీ సభ్యులు ఉదయ్‌భాస్కర్, రమేష్, లోక్ సాయి రాము, అరవ వల్లి, వేలూరు శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబరు 2 నుండి ఆడుదాం ఆంధ్ర క్రీడలు



**కావలి రూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త** అక్టోబరు 2వ తేది నుండి ఆడుదాం ఆంధ్ర క్రీడలు యువతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు కావలి ఎంపిడివో అన్నమరాజు వెంకట కృష్ణమోహనరావు తెలిపారు. స్థానిక ఎంపిడివో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిడివో కృష్ణమోహనరావు మాట్లాడారు. అక్టోబరు 2వ తేది నుండి ఆడుదాం ఆంధ్ర క్రీడలు ప్రారంభిస్తున్నందున కావలి మండలంలోని 17 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు పాల్గొనవచ్చునని తెలిపారు. ఈ క్రీడలకు సచివాలయ స్థాయిలో, వార్డుల స్థాయిలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకునే వారు మీ ఆధార్‌కార్డుతో చేయించుకోవాలని చెప్పారు. ఆంధ్ర క్రీడలలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాట్మింటన్, క్రికెట్ తదితర క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని మండలంలోని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ క్రీడలకు సంబంధించిన సమాచారాన్ని మీ పరిధిలోని జెడ్పీ స్కూల్స్‌లో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయాలలోని సిబ్బంది ద్వారా తెలుకోగలరని చెప్పారు. ఈ కార్యక్రమం కావలి ఎంపిడివో, తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఎంఇవోల పర్యవేక్షణలో జరుగుతాయని తెలిపారు. పూర్తి సమాచారం కోసం మండల కోఆర్డినేటర్, కావలి జెడ్పీ హైస్కూలు పిడి చిరంజీవిని సంప్రదించాలని కోరారు.

## ఆగష్టు 7నుంచి పల్లెబాట



**నెల్లూరు సిటీ, ఆగస్టు 3, ప్రభాతవార్త** నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆశీస్సులతో 25 రోజుల పాటు గిరిజన పల్లెబాట కార్యక్రమాన్ని నిర్విరామంగా చేపట్టనున్నామని నెల్లూరు వైసీపీ ఎస్టీసెల్ ప్రెసిడెంట్ పాలకీర్తి రవి పేర్కొన్నారు. నెల్లూరు వైసీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పాలకీర్తి రవి మాట్లాడుతూ 26 డివిజన్లు, 18 పంచాయతీల్లో ఈ పల్లెబాట కార్యక్రమం సాగుతుందని తెలిపారు. స్థానిక గిరిజనుల సమస్యలను సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సత్వర పరిష్కారం చూపడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గిరిజనులకు ఓటరు, ఆధార్, రేషన్ కార్డులను కల్పించడంతో పాటు చదువు మానేసిన పిల్లలను మళ్లీ బడికి పంపడం లక్ష్యంగా నిర్ణయించుకున్నామని తెలిపారు. ఆగష్టు నెల 7వ తేదీ 11గంటలకు కొండ్లపూడి గిరిజన సంఘం నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం సెప్టెంబరు నెల 3వరకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తున్న నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్టీసెల్ నాయకులు స్వర్ణ ప్రసాద్, జగన్నాథం శ్రీను, గున్నము రాహుల్, చల్లా మాధవి, అరవ కామాక్షి, అల్లాడి అశోక్‌దాస్, ఎంపీటీసీ సభ్యులు ఉదయ్ భాస్కర్, రమేష్, లోక్‌సాయి రాము, ఆరవ వల్లి, వేలూరు శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రాయోజిత పథకం(సీఎస్ఎస్)పై కేంద్రాన్ని వివరాలు కోరిన ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు సిటీ, ఆగస్టు 3, ప్రభాతవార్త** కేంద్ర ప్రాయోజిత పథకం అమలు, రాష్ట్రాల వారీగా నిధుల కేటాయింపులు తదితర వివరాలను తెలపాల్సిందిగా రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంబంధిత మంత్రిత్వ శాఖను కోరారు. రాష్ట్రాలకు న్యాయపరమైన మౌలిక సదుపాయాల కోసం ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన వివరాలు కోరారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ సింగ్ మేఘ్వాల్ సమాధానమిస్తూ న్యాయ వ్యవస్థ మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాథమిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఆధారపడి ఉంటుందన్నారు. వనరులను భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలు/యూటీలకు కేంద్ర ప్రాయోజిత పథకం(సీఎస్ఎస్) అమలు చేస్తుందన్నారు. జిల్లా సబార్డినేట్ న్యాయ అధికారులకు కోర్టు భవనాలు, నివాస గృహాల నిర్మాణం, డిజిటల్ కంప్యూటర్ రూమ్ ఏర్పాట్లు, లాయర్ల హాల్స్, టాయిలెట్ నిర్మాణ అంశాలను ఈ పథకంలో చేర్చినట్లు తెలిపారు. ఇందుకోసం రూ.9వేల కోట్లు కేటాయించగా, కేంద్ర వాటాగా రూ.5307.00 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటి వరకు 222.42 కోట్లు విడుదలయ్యాయన్నారు. ప్రత్యేక కేటగిరి కింద ఆంధ్రప్రదేశ్‌కు నిధుల కేటాయింపుపై కేంద్రం వద్ద ఎలాంటి ప్రతిపాదన లేదన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల పంపకం విధానాన్ని ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్ణయిస్తుందన్నారు.

**పోస్టాఫీసులో పాస్‌పోర్టు సేవలపై వివరాలు కోరిన ఎంపీః** 2017 జనవరిలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోస్టాఫీసు పాస్‌పోర్టు సేవా కేంద్రాల(పీఓపీఎస్‌కే) వివరాలపై రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్రాన్ని ప్రశ్నించారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రాష్ట్ర మంత్రి వి.మురళీధరన్ సమాధానమిస్తూ 2017 జనవరిలో దేశంలోని ప్రతి లోక్ సభ నియోజకవర్గంలో హెడ్ పోస్టాఫీసులు, పోస్టాఫీసుల వద్ద పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల(పీఓపీఎస్‌కే) ఏర్పాటుకు కేంద్రం నిర్ణయించిందన్నారు. అరకు లోక్‌సభ నియోజకవర్గం మినహా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలో పాస్‌పోర్టు సేవా కేంద్రాలను(పీఓపీఎస్‌కే) ఏర్పాటు చేశామన్నారు.

## జగనన్న సురక్షా కార్యక్రమం విజయవంతం



**కందుకూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త** జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రపంచంలోనే అద్వితీయమైనటువంటి కార్యక్రమం, జగనన్న సురక్ష కార్యక్రమం అని ఆయన కితాబిచ్చారు. పేద ప్రజలకు, అర్హులకు 11రకాల ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు ఉచితంగా జారీ చేయడం అనేది రికార్డు అన్నారు. దీనికి జిల్లా కలెక్టర్ హరిహరన్ ఆధ్వర్యంలో ఉద్యోగులందరూ సహకరించి ఈ కార్యక్రమాన్ని సజావుగా ముందుకు తీసుకుపోవడం హర్షదాయకమని ఎమ్మెల్యే తెలిపారు. కందుకూరు నియోజకవర్గంలో అక్కడక్కడా రోడ్లు దెబ్బతిన్నాయని, వీటి అభివృద్ధికి మూడుకోట్లు మంజూరయ్యాయని మహీధర్‌రెడ్డి వివరించారు. చిన్నపవని నుండి అన్నెబోయిన పల్లిఇక పోయే రోడ్డు కూడా బాగుచేస్తామన్నారు. ఎర్రారెడ్డిపాలెం రోడ్డు 7.7కోట్లు టెం దర్లు త్వరలో వేస్తారని ఆయన వివరించారు. తెట్టు - రామాయపట్నం రోడ్డును నాలుగు లైన్ల రోడ్డు కింద మార్చడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, ఈ రోడ్డు నిర్మాణం వల్ల పోర్టుకు వెళ్లడానికి మార్గం సుగమమవుతుందన్నారు. రామాయపట్నం పోర్టు పనులు శ్రీఘ్రంగా జరుగుతున్నాయని, మొదటి బెర్త్ లోకి షిప్పు త్వరలో వచ్చేలా పోర్టు బాధ్యులు నిరంతరం పని చేస్తున్నారన్నారు.

## అక్రమమైనింగ్ ,తెల్లరాయి తవ్వకాలు నిర్వహిస్తే చర్యలు



**సైదాపురం ఆగష్టు 3 ప్రభాతవార్త** ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అక్రమ మైనింగ్, తెల్లరాయి తవ్వకాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సైదాపురం ఎస్ఐ చల్లావాసు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేఖర్లతో మాట్లాడుతు సైదాపురం మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఎవ్వరైనా అక్రమంగా మైనింగ్ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అదే విధంగా గ్రామాలలో పట్టా ,ప్రభుత్వ భూములలో అనుమతులు లేకుండా తెల్లరాయి తవ్వకాలు నిర్వహిస్తే వారిపై చర్యలు తీసుకొని వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంగా పరిమితి మించి నిబందనలు విరుద్ధంగా టిప్పర్లు అధిక లోడ్‌లతో రాయిని తరలించడం వలన వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

## చంద్రబాబుతోనే పేద కుటుంబాల అభ్యున్నతి సాధ్యం



**నెల్లూరు ఆగష్టు 3, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా అభివృద్ధిలోకి వస్తుందని ఇందులో ఏమాత్రం అతిశయోక్తి లేదని నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, రూరల్ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రూరల్ నియోజకవర్గంలోని కొండ్లపూడి గ్రామంలో మహాశక్తి చైతన్య రథయాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితే మహిళల కోసం మహానాడులో ఇచ్చిన హామీలను నెరవేర్చుతాడని, దాంతో ప్రతి పేద కుటుంబంలోని పిల్లల ఉన్నత చదువులు చదువుకోవడమే కాకుండా, ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుదలకి దోహదపడుతుందన్నారు. మహానాడులో మహిళలకి ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన మూడు పథకాలు నెరవేరాలంటే తప్పనిసరిగా చంద్రబాబుని సీఎంని చేయాలని కోరారు. రాష్ట్రం వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు పెరిగిన నిత్యావసర ధరలను మహాశక్తి ద్వారా ప్రజలకు తెలియచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు తాళ్ళపాక అనూరాధ, గిరిధర్‌రెడ్డి, తోటా శోభారాణి, వనజారెడ్డి, మమతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రధమ పౌరురాలిని అవమానించిన వైసీపీ నేతలు



**నెల్లూరు ఆగష్టు 3, ప్రభాతవార్త-వైద్యం** నగర కార్పొరేషన్ పరిధిలో హైఎస్ట్ ప్రొటోకాల్ కలిగిన ఉన్న నగర మేయర్ పొట్లూరి స్రవంతిని వైసీపీ నేతలు ఘోరంగా అవమానించారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిది పఠాన్ సాబిర్‌ఖాన్ విమర్శించారు. గురువారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో సాబిర్‌ఖాన్ విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా బారాషాహిద్‌లో జరిగే రొట్టెల పండుగలో నగర మేయర్‌కి ఇవ్వాల్సిన ప్రధాన్యతను ఇవ్వకుండా వైసీపీ కాంట్రాక్టర్లు, చోటా మోటా నేతలు, ముఖ్యనేతలు జేబులు నింపుకున్నారని సాబిర్‌ఖాన్ ఆరోపించారు. ఉత్సవంలో ఆమెకు కనీస మర్యాదగా ఆహ్వానాలు లేకపోవడం దారుణమన్నారు. రొట్టెల పండుగలో భక్తులకు అన్ని సౌకర్యాలను అందించిలేకపోయారని వెల్లడించారు. వైసీపీ నాయకుల దర్గాలో దందాలతో పొట్ట చేతపట్టుకుని వచ్చిన వ్యాపారస్తుల జేబులకు చిల్లులు పడ్డాయని ఆ పాపం ఊరికే పోదన్నారు. 72మంది అవగాహన లేని వారితో ఒక కమిటీని వేసి రొట్టెల పండుగన్న దానికే అర్థం లేకుండా చేశారని, ఎన్నో ఏళ్ళుగా ఏడురోజులు జరిగే రొట్టెల పండుగ భక్తులకు సరైన వసతి సౌకర్యాలు లేక పండుగ మూడో రోజుకే భక్తులు లేక వెలవెలపోయిందని సాబిర్‌ఖాన్ పేర్కొన్నారు. రొట్టెల పండుగకు వారం ముందు నుండే దర్గాకు స బంధించిన పనులు ప్రారంభం అవుతాయని, అయితే ఈ ఏడాది రెండు రోజులు ముందు నుంచి పనులను ప్రారంభించడంతో సమయానికి పూర్తిస్థాయిలో పనులు చేయలేక నాశిరకం పనులతో కార్పొరేషన్ నిధులతో పనులు జరిగాయని అందుకు ఉదాహరణ స్వర్ణాల చెరువు ఘాట్‌లో లైట్లు ఊడిపోవడం నిదర్శనమన్నారు. ప్రొటోకాల్ ఉన్న ప్రధమపౌరురాలిని ఉత్సవంలో ఎక్కడా ఆహ్వానించకపోవడం ఒక మహిళను ఇంతగా అవమానించడం ఒక్క వైసీపీ నేతలకే చెల్లుతుందని మండిపడ్డారు. రొట్టెల పండుగను కనివినీ ఎరుగనిరీతిలో ఇప్పటి వరకు జరిపింది పొంగూరు నారాయణ టీడీపీ హయాంలోనేనన్నారు. దర్గా పాసులను వైసీపీ నేతలు అమ్ముకుని సొమ్ము చేసుకున్న ధౌర్భాగ్యపు పరిస్థితులు ఈ ఏడాది నెలకొన్నాయన్నారు. ఈ సమావేశంలో నాయకులు హయాద్‌బాబా, నెల్లూరు పార్లమెంటు కార్యదర్శి కనపర్తి గంగాధర్, అస్లం సయ్యద్, సాజిద్, సుబ్రమణ్యం, కోటయ్య, శ్రీనివాసులు, జహీర్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి 90 వేల గడపలు పూర్తి చేసి సంబరాలు



**బుచ్చి ఆగష్టు 3 ప్రభాతవార్త** కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమలో భాగంగా 90 వేలు గడపలు పూర్తి చేసిన సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెంలో పెద్దఎ త్తున కేకును కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార ్య క్రమం నగరపాలక చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అద్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మా ట్లాడుతు భగవంతుడు , దివంగత నేతలు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆశీసు ్సలతో ము ఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం, ప్రజాప్రతినిదులు, నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలింటర్లు అందరి సహాకారంతో 90 వేల గడపలు పూర్తి చేశామని తెలిపారు. ప్రతి ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రజల కష్టసుఖాలు తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా ఈకార్యక్రమం నిర్వహించడం చాలా గొప్ప విషయమని అన్నారు. ఈకార ్యక్రమంలో క్యాన్స ర్‌పేషింట్లను, తల్లిదండ్రులు లేని బిడ్డల్ని, అనారోగ్యవంతుల్ని చూస్తున్నాం వారు కష్టాలు కొంత అయినా తీర్చాలని ఎన్ఎస్ఆర్ ట్రస్టు ద్వారా వారికి నావంతు కృషిగా ఆర్ధిక సహాయం అందజేస్తున్నానని అన్నారు. భారతదేశంలో ఇటువంటి కార్యక్రమం ఎక్కడ లేదని అన్నారు. లక్ష గడపలు పూర్తి అయిన సందర్భంగా మైపాడులో కళ్యాణ్‌రెడ్డి ఆద్వర్యంలో పెడుతున్నాం. లక్షా 7 వేలు గడపలు పూర్తి అయితే చివరిగా బుచ్చిరెడ్డిపాళెంలో పెట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈమద్యన 14,15 వార్డుల పరిధిలో పర్యటించినప్పుడు కాలువ విషయం నా దృష్టికి తీసుకొని వచ్చారు. వెంకటేశ్వర్లు స్వామి గుడి వద్ద నుండి మోహన్‌బాబు హాస్పటల్ వరకు కాలువవాల్స్, పైన కవరే కి కోటి రూపాయాలు మంజూరు చేయించి టెండర్లుకూడా పిలవడం జరిగిందని అన్నారు. రెడ్డిపాలెంలో రోడ్డకి 50 లక్షల రూపాయాలు నుడా నుండి మంజూరు చేయించడం జరిగిందని చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్ని మాట్లాడిని 2024లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో భాగంగా నాయకులు కేకు కట్ చేసి ఎమ్మెల్యేకి తినిపించారు. ఈకార్యక్రమంలో నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి. నల్లపరెడ్డి రోహిణ్‌రెడ్డి, డిఎల్‌డిఎ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, వ్యవసాయ మండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, జొన్నవాడ దేవస్థానం చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, చైర్‌పర్స న్ మోర్ల సుప్రజ, మోర్ల మురళీ, వైస్ చైర్‌పర్స న్ కోటంరెడ్డి లలితారెడ్డి, వైస్ చైర్మన్ షేక్ షాహుల్, మండల పార్టీ కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, టౌన్ అద్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, కౌన్సిలర్లు చీర్ల ప్రసాద్‌యాదవ్, రాచూరు సత్యనారాయణ, షేక్ షకిలా బేగం, పఠాన్ నస్రీన్, కంఠా అనంతమ్మ, యానాదిరెడ్డి, శివకుమార్‌రెడ్డి, బెల్లం మల్లారెడ్డి, రహమత్‌భాషా, హౌసింగ్ ఏఇ పెంచలయ్య, పిఆర్ స్పెషల్ ఏఇ మల్లికార్జునరెడ్డి, ఇరిగేషన్ డిఓ మధుసూదన్‌రెడ్డి, ఎఇ వెంకటేశ్వర్లు, బిట్రగుంట ప్రమీలమ్మ, కౌన్సిలర్ శ్రీదేవి, నాగరాజు, డాక్టర్ అల్లాబక్ష, నాగిరెడ్డి ద్వారకనాద్‌రెడ్డి, దళితసేవాదళ్‌నాయకులు పట్రిబాబు, జొన్నవాడ దేవస్థానం ట్రస్టు బోర్డుమెంబర్ గుంటూరు కామేశ్వరి, గుంటూరు వెంకటేశ్వర్లు, ఎపిఎం లలితారెడ్డి, కౌన్సిలర్ మోర్ల జయంతి, కో ఆప్షన్ మెంబర్ షేక్ ఇర్షాద్, సచివాలయ సిబ్బంది, వాలింటర్లు పాల్గోన్నారు.

## ఇంటింటికి బీసీల భరోసా బాట



నెల్లూరుటౌన్, ఆగస్టు 3, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు నెల్లూరు నారాయణ సారథ్యంలో తెలుగుదేశం పార్టీ సాధికార సమితి నెల్లూరు జిల్లా కన్వీనర్ మురళీమోహన్‌రాజు ఆధ్వర్యంలో నెల్లూరు బివినగర్‌లో ఇంటింటికి బీసీల భరోసా బాట సమావేశ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ భట్రాజు సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ప్రసన్నాంజనేయరాజు మాట్లాడుతూ భట్రాజు కులాన్ని మొట్టమొదటిగా విలువలతో కూడుకున్న గుర్తింపునిచ్చిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమేనన్నారు. భట్రాజుల కుల అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులను కేటాయించిందన్నారు. ఈరోజు ప్రతి ఒక్క భట్రాజు కుటుంబీకుడు రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా ముందుకు నడవాలని ఆలోచనతో ఈ రోజు సాధికార సమితి ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ సాధికార సమితి ద్వారా రాష్ట్ర నలుమూలలలో ఉన్నటువంటి భట్రాజు కుటుంబీకుల పరిస్థితులను తెలుసుకుని వారి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భట్రాజు సాధికార సమితి సభ్యులు తిరుపతిరాజు, ఓంకారం వెంకటేశ్వరరాజు, కప్పా శ్రీనివాసరాజు, అవధానం ప్రభాకర్‌రాజు, నన్నయ్యభట్ల శ్రావణ్‌రాజు, ఎన్.వినోద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ



**నెల్లూరుటౌన్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ మరియు స్కిల్ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ముస్లీం మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఉర్దూ అకాడమీ కంప్యూటర్ శిక్షణ కేంద్రాల శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఇన్‌చార్జ్ సయ్యద్ అబ్దుల్ వహాబ్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రమైన నెల్లూరులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల మూడో వారంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నవని శిక్షణ పొందేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 17వ తేది లోపల ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్ యాప్ ఐ.జె.ఎన్. ప్లే స్టోర్ నందు అభ్యర్థులు ఏ మండలానికి చెందిన, పదవ తరగతి ఉత్తీర్ణత పొందిన ధ్రువీకరణ సర్టిఫికేట్, స్థానికత, ఆధార్‌కార్డు తదితర ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో దరఖాస్తులతో పొందుపరచాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు మూడు నెలల పాటు ఈ ఉచిత శిక్షణ పొందేలా తమ పేర్లను పూర్తి వివరాలతో తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో పొందుపరచుకోవాలనని స్పష్టం చేశారు. మూడు నెలల పాటు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం జిల్లా కేంద్రమైన నెల్లూరులోని పెద్ద బజారు, దాడి వారి వీధి, ఉర్దూ అకాడమీ కేంద్రం నందు కార్యాలయ దినములలో నేరుగా సంప్రదించవచ్చన్నారు. అలాగే 9966740353, 9493857379 నెంబర్లను సంప్రదించి అభ్యర్థులు తమకు రావలసిన సమాచారాన్ని తెలుసుకోవచ్చని ఆయన సూచించారు.

## కావలి పట్టణంలో పర్యటించిన సోమిరెడ్డి, బీద

### పలువురు టిడిపి నేతలకు పరామర్శ



**కావలి, ఆగస్టు 3 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రయాదవ్, కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడులు గురువారం కావలి పట్టణంలో పలువురు టిడిపి నేతలను పరామర్శించారు. స్థానిక దేవి థియేటర్ రోడ్డులోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, హైకోర్టు న్యాయవాది మువ్వల వెంకట నారాయణ ఉత్తరక్రియలకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన



కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కావలి మాజీ మున్సిపల్ చైర్మన్, మాజీ ఎయంసి చైర్మన్, టిడిపి పట్టణ అధ్యక్షులు గ్రంధి యానాదిశెట్టి సతీమణి ఇటీవల మృతి చెందడం తెలిసిందే. ఆయన నివాసానికి వెళ్లారు. గ్రంధి కుమార్తె, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్యను, గ్రంధిని పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెల్లూరు పార్లమెంటు జిల్లా ఉపాధ్యక్షులు, సీనియర్ టిడిపి నాయకులు మన్నవ రవిచంద్ర సతీమణి విజయకుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవిచంద్రను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ 10వ వార్డు నాయకులు ఆలి శ్రవణానందం ఉత్తరక్రియలకు హాజరై వారి కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేశారు. వారితో పాటు ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోట్లూరు శ్రీనివాసులు, నియోజకవర్గ పరిశీలకులు బొమ్మ సురేంద్ర, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి, యువపారిశ్రామికవేత్త, కావ్య కృష్ణారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్ని శాఖల సమన్వయంతో రొట్టెల పండుగ విజయవంతం



నెల్లూరుటౌన్, ఆగస్టు 3, ప్రభాతవార్త: అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయం, అందరి సహకారంతో రొట్టెల పండుగ విజయవంతం అయిందని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ పేర్కొన్నారు. గురువారం నెల్లూరు బారాషహీద్ దర్గా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీ వికాస్‌తో కలిసి జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అధికార యంత్రాంగం సమర్థవంతంగా సమిష్టిగా పని చేసి రొట్టెల పండుగను విజయవంతం చేసినట్లు చెప్పారు. పండుగకు వారం రోజుల ముందు నుంచే ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష సమావేశాలు నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు చెప్పారు. వారి సూచనల మేరకు దర్గా ప్రాంగణాన్ని ఏడు జోన్లుగా విభజించి హెల్ప్ డెస్కులు, తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు చెంప్పారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టామన్నారు. ప్రధానంగా ఘాట్ పరిసరాలు, దర్శనం, ఫుడ్ జోన్లు, దుకాణాల వద్ద ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు చెప్పారు. ప్లాస్టిక్ రహితంగా దర్గా ప్రాంగణాన్ని ఉంచామన్నారు. పండుగ జరిగిన ఐదు రోజుల పాటు తాను, కమిషనర్ పర్యటిస్తూ ఏర్పాట్లపై పర్యవేక్షణ చేశామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎక్కడా అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యసేవలు అందించామన్నారు. పోలీసు, అగ్నిమాపక సిబ్బంది సేవలను జాయింట్ కలెక్టర్ అభినందించారు.

ఏ చిన్న ఫిర్యాదు రాకుండా పని చేశాం ః కమిషనర్ ఎంపీ, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సూచనల మేరకు ఐదు రోజులు సమన్వయంతో పక్కాగా ఏర్పాట్లు చేశామని కమిషనర్ తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన సుమారు 12 నుంచి 15 లక్షల మంది భక్తులకు ఏ చిన్న ఇబ్బంది లేకుండా ఎవరు కూడా ఫిర్యాదు చేయకుండా ఏర్పాట్లు చేశామన్నారు. సమారు 5300 మంది పారిశుధ్య కార్మికులు అహర్నిశలు పని చేశారన్నారు. స్వచ్ఛమైన తాగునీటిని భక్తులకు అందించామన్నారు. ప్రధాన పాత్రికేయులు ఎంతో సహకరించారని, వారు తమ దృష్టికి తీసుకొచ్చిన చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సంజనసింహ, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, డీటీసీపీవో దేవికుమారి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నిర్మలాదేవి, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ సంపత్‌కుమార్, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పొగాకు పంట పరిమితికి మించి సాగుచేయరాదు - ఆర్ఎం



**మర్రిపాడు, ఆగస్ట్ 3 ప్రభాతవార్త:** 2023-24 పంటకాలంలో పొగాకు రైతులు పరిమితికి మించి పొగాకు సాగుచేయరాదని భారత పొగాకుబోర్డు ఒంగోలు రీజనల్ మేనేజర్ ఎం.లక్ష్మణ్‌రావ్ కోరారు. మర్రిపాడు మండలం డిసిపల్లి వేలం కేంద్రంలో గురువారంతో వేలం ప్రక్రియ ముగిసింది. ఈ సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు .ఈసందర్భంగా లక్ష్మణరావ్ మాట్లాడుతూ ఈసంవత్స రం పొగాకు పంటకు మంచి ధరలు లభించాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు ఎక్కువ విస్తీర్ణంలో పొగాకు చేయరాదని, బోర్డు నిర్ణయించిన లక్ష్యంమేరకు, బ్యారన్ కు నిర్ణయించిన విస్తీర్ణంలో పొగాకు సాగు చేయాలన్నారు. అప్పుడే రైతులకు రానున్న సీజన్‌లోను మంచి ధరలు లభిస్తాయన్నారు. అనంతరం పొగాకువేలంలో కొనుగోలు చేసిన కంపెనీల ప్రతినిధులను ఆర్ఎం లక్ష్మణరావ్, ఐటిసి కంపెనీ లీడ్ మేనేజర్ శివకుమార్, రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈకార్యక్రమంలో వేలం నిర్వణాధికారి జి.రాజశేఖర్, రైతు సంఘం నాయకులు ఆరికట్ల జనార్ధన్‌నాయుడు, బాలా వెంగళరెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, ఇ.భాస్కర్‌రెడ్డి, వేలం కేంద్ర పరిధిలోని రైతులు , బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.